నో సిగ్నల్స్.. డేంజర్ బెల్స్

- నగరంలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- నెలల తరబడి ఇదే పరిస్థితి
- అటు ప్రజలకు, ఇటు ట్రాఫిక్ పోలీసులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు



హిందూ కళాశాల కూడలిలో పనిచేయని సిగ్నల్స్

పట్నంబజారు: నగరంలో నానాటికీ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రోడ్డు మీదకు రావాలంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. దినదినగండంగా మారింది. దీనికి తోడు ట్రాఫిక్ అధికారులు, సిబ్బందిని సాంకేతిక సమస్యలు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. గుంటూరు నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా మారాయి. నెలల తరబడి పని చేయకపోవడంతో అటు ప్రజలతో పాటు ట్రాఫిక్ పోలీసులకు తంటాలు తప్పడం లేదు.

కూడళ్లలో పొంచిఉన్న ప్రమాదాలు

నగరంలో మొత్తం 11 ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా పాత బస్టాండ్ సెంటర్, హిమని కూల్‌డ్రింక్స్, హిందూ కళాశాల కూడలి, బృందావన్ గార్డెన్స్, మదర్‌థెరిస్సా విగ్రహం పాయింట్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలున్నాయి. అయితే, వీటిలో ఏ ఒక్కటీ పని చేయని పరిస్థితి ఏర్పడింది. మదర్ థెరిస్సా విగ్రహం వద్ద, బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో మాత్రమే అప్పుడప్పుడు పని చేస్తున్నాయి. వయా చుట్టుగుంట మీదుగా నర్సరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి బస్సులు, వాహనాలు హిందూ కళాశాల కూడలికి వస్తుంటాయి. అక్కడ సిగ్నల్స్ పని చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎత్తు రోడ్డు సెంటర్‌లో సైతం సిగ్నల్స్ మొరాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చుట్టుగుంట సెంటర్లోనూ అదే పరిస్థితి నెలకొంది. సమస్య రెండు మూడు నెలల నుండి ఇదే విధంగా ఉన్నప్పటికీ కనీసం పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. హిందూ కళాశాల కూడలిలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. నగరంలోని అన్ని ప్రాంతాలకు నాలుగు రోడ్డు కూడలి కావడం .. అక్కడ సిబ్బంది ఉన్నా కొంత మంది సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆరంభ శూరత్వం

నగరంలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులు యోచించారు. ఈ మేరకు కార్పొరేషన్ ఉన్నతాధికారులకు గతంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించారు. అయితే సిగ్నల్ ఏర్పాటు మాత్రం ఆరంభ శూరత్వంగానే మిగిలిపోయింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, భగత్‌సింగ్ బొమ్మ సెంటర్, గుజ్జనగుండ్లతో పాటు మరి కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సిగ్నల్స్ తప్పనిసరి. కార్పొరేషన్ అధికారుల పట్టించుకోకపోవటంతో సిగ్నల్స్ ఏర్పాటు ఆలస్యమైందనే విమర్శలు ఉన్నాయి. దీంతో పాటు నిత్యం పని చేయని సిగ్నల్స్‌కు సంబంధించి అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రయోజనం లేదని ట్రాఫిక్ సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికే పలుమార్లు లిఖితపూర్వకంగా పోలీసు ఉన్నతాధికారుల నుంచి ట్రాఫిక్ అధికారుల వరకు సమస్యను విన్నవించినప్పటికీ ప్రతిఫలం లేదనే చెప్పాలి. ఆయా ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించే సిబ్బంది కేవలం ఒక్కరే ఉండటం.. వారు కూడా కనపడకుండా పోవడంతో పరిస్థితి మరింత ఇబ్బంది మారింది. ఇప్పటికైనా పోలీసు, కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి సిగ్నల్ సమస్యను పరిష్కరించాలనే అభిప్రాయాలు నగర ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.



హిమని కూల్‌డ్రింక్ సెంటర్‌లో మొరాయించిన సిగ్నల్స్



పాత బస్టాండ్ బస్టాండ్ సెంటర్‌లో పరిస్థితి ఇదీ

కోడ్ ఎత్తి వేయగానే అభివృద్ధికి చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరపాలక సంస్థ పరిధిలోని ట్రాఫిక్ సిగ్నల్స్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) ఏజెన్సీని ఏర్పాటు చేసింది. టెండరింగ్ ప్రక్రియకు వచ్చేసరికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. కోడ్ ఎత్తివేయగానే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– ఎం శ్యాంసుందర్, నగరపాలక సంస్థ ఎస్ఈ

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



నగరంపాలెం: జిల్లాలో హోంగార్డు పని చేస్తున్న వై.అక్కేశ్వరరావు గతేడాది డిసెంబర్ 12న అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.37 లక్షల చెక్కుని అతడి భార్య ప్రమీలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ స్వర్ణలత, ఆర్ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ చంద్రశేఖర్, హోంగార్గ్ ఎన్సీఓ అధికారులు పాల్గొన్నారు.

థైరాయిడ్‌లోపంతో మహిళల్లో పలు సమస్యలు



గుంటూరు మెడికల్: థైరాయిడ్‌లోపంతో మహిళల్లో పలు సమస్యలు తలెత్తుతాయని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్ కుమార్ తెలిపారు. వరల్డ్ థైరాయిడ్ డే సందర్భంగా శనివారం స్థానిక కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి ఉన్న పది నుంచి 30 శాతం మందికి థైరాయిడ్ హార్మోను తక్కువ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల షుగర్ కంట్రోల్ కష్టమవుతుందని పేర్కొన్నారు. షుగర్ ఉన్నవారు థైరాయిడ్ పరీక్ష చేయించుకుంటే మంచిదని ఆయన సూచించారు. థైరాయిడ్‌లోపం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, సంతానలేని, షుగరు కంట్రోల్ కాకపోవడం ఇతర అనర్థాలు తలెత్తుతాయన్నారు. థైరాయిడ్ తగ్గిపోతే నీరసం, అలసట, బద్ధకం డిప్రెషన్, మలబద్ధకం, ఆహారం ఎక్కువ తినకపోయినా బరువు పెరగడం, అల్ప రక్తపోటు, పల్స్ రేటు తగ్గిపోవడం లక్షణాలు ఉంటాయని ఆయన వివరించారు.

శాసనాలలో మన సంస్కృతి నిక్షిప్తం



నగరంపాలెం: శాసనాల అధ్యయనం ద్వారా మన భాష, సంస్కృతి, మూలాలు తెలుస్తాయని లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ఆవరణలో శనివారం అమరావతి అమరేశ్వరాలయ శాసనాల సంపుటి 'అమరేశ్వరం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంపుటిలో ఉన్న 38 శాసనాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే పలు ప్రాంతాలు, వెయ్యేళ్ల కిందట ఉమ్మడి జిల్లా రాజులు, వారి ప్రతినిధులు, ఉద్యోగులు ఇచ్చిన దానాలు మొదలైన విషయాలన్నీ తేటతెల్లంగా తెలుస్తాయని అన్నారు. సభకు అరసం ఏపీ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కె.ప్రఫుల్లరాణి పుస్తకావిష్కరణ చేయగా, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ భూసురాపల్లి వెంకటేశ్వర్లు, ఆర్.సాంబశివరావు, కోటేశ్వరప్రసాద్, కందిమళ్ల శివప్రసాద్, కె.శివరెడ్డి, నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేటలోని ఓ ప్రాంతంలో సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.11,500 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్ల్యూహెచ్‌ఓ నిబంధనల ప్రకారమే ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఎఫ్ఓజీఎస్ఐ నిబంధనల మేరకే గర్భిణులకు సిజేరియన్లు చేస్తున్నామని డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, ప్రసూతి విభాగ అధిపతి డాక్టర్ బి. వెంకటేశ్వరావురావు తెలిపారు. తమ బోధనాసుపత్రికి పేద,మధ్య తరగతి, గ్రామీణ ప్రాంత ప్రజల ఎక్కువగా వస్తున్నట్లు వెల్లడించారు. చాలా క్లిష్టమైన కాన్పులు కోసం, గతంలో సిజేరియన్ చేయించుకున్న వారు వస్తున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి ద్వారా అనేక రకాల పథకాల కింద గర్భిణులు, కాన్పు అయిన మహిళలకు వైద్య సహాయం ఉచితంగా అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఎన్నికల కమిషన్ నిరాకరించడం తగదు



లక్ష్మీపురం: పార్లమెంట్, నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల సమాచారాన్ని ఎన్నికల కమిషన్ నిరాకరించడం సరైంది కాదని అవగాహన సంస్థ సభ్యులు విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం 'ఎన్నికల కమిషన్ – విశ్వసనీయత ' అంశంపై సమావేశం నిర్వహించారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలో అతికీలకమైన పోలింగ్ సమాచారాన్ని వెల్లడించడంలో ఎన్నికల కమిషన్ మీనమేషాలు లెక్కించడం దేశ ప్రతిష్టకు భంగకరమని తెలిపారు. మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఓటింగ్ వివరాలు వెల్లడిపై ఈసీని ఆదేశించలేమని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించడం ప్రజాస్వామ్య శక్తులకు తీవ్ర నిరాశ కలిగించిందని చెప్పారు.

ఏజెంట్ల వివరాలు నెలాఖరులోగా ఇవ్వాలి

ఆర్‌ఓ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు,కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలు ఈనెల 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందించాలని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4 జరగనున్న ఓట్ల లెక్కింపుపై గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సజావుగా జరగడానికి అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని ఆమె కోరారు. లెక్కింపు కేంద్రానికి హాజరయ్యే ఏజెంట్ల వివరాలను ఈ నెల 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వివరాలు ఇవ్వాలని సూచించారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, గుర్తింపు కార్డ్ తెచ్చుకోవాలని ఆమె తెలిపారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, కేంద్రం పరిసరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రంలో దాన్ని డిపాజిట్ చేయాలని చెప్పారు. జూన్ 3న ఆర్‌ఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలిస్తామన్నారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకు లెక్కింపు సిబ్బందిని టేబుల్స్ వారీగా ర్యాండమైజేషన్ మేరకు కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఆ సమయానికి రావచ్చని, 6 గంటలకు స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేస్తామని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. కేంద్రంలో ఈవీఎంల లెక్కింపునకు 14, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. లెక్కింపు ప్రక్రియ అంతా సీసీ కెమెరాల ద్వారా రికార్డ్ చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు వెంకటలక్ష్మి, ప్రదీప్ కుమార్, భీమరాజు, సూపరింటెండెంట్ పద్మనాభరావు, తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే గృహ, వాహన రుణాలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ జవహర్



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, యూబీఐ రీజినల్ హెడ్ జవహర్

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అతి తక్కువ వడ్డీ రేటుతో గృహ, వాహన రుణాలు అందిస్తోందని బ్యాంకు గుంటూరు రీజనల్ హెడ్ ఎస్.జవహర్ తెలిపారు. స్థానిక నగరంపాలెంలోని ప్రాంతీయ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'రిటైల్ ఎక్స్‌పో–2024' శనివారం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంకు సేవలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. రూ.40 లక్షల వరకు కొల్లేటరల్ లేని విద్యా రుణాలు అందిస్తోందన్నారు. అనంతరం పలువురికి గృహ, వాహన, విద్యా రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ రామాంజనేయ కుమార్, పలువురు బ్రాంచి మేనేజర్లు, నగరంలోని బిల్డర్లు, కారు డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు పాల్గొన్నారు.

ఘనంగా సాయిశృతి అకాడమీ వార్షికోత్సవం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి కళా వేదికపై శనివారం సాయంత్రం సాయిశృతి మ్యూజిక్ అకాడమీ 37వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వ్యవస్థాపకులు ప్రేమ్‌కుమార్ శిష్య బృందం వోకల్, వీణా, వేణువు, మాండోలిన్, తబల, డోలక్, కీబోర్డు, హార్మోనియం, వయోలిన్, గిటార్, డ్రమ్స్ తదితర వాయిద్యాలతో ప్రతిభను చాటారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, వల్లూరి కృష్ణకిశోర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

కౌంటింగ్ రోజు ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేవప్రభాకర్

పట్నంబజారు: ఎన్నికల కౌంటింగ్ రోజు ఘర్షణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లాలాపేట స్టేషన్ సీఐ పి.దేవప్రభాకర్ చెప్పారు. సంగడిగుంట, లాలాపేట, చౌత్రా సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. సీఐ దేవప్రభాకర్ మాట్లాడుతూ గెలుపు ఎవరిదైనా అంతా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషిద్ధమని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు, వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన పొదిలి వెంకటరాయుడు, తండ్రి : పొదిలి నరసింహారావు, నివాసం : డోరు నెం. 1-1-24, అతిథిగృహ ఫుడ్స్, 3వ లైను, లక్ష్మీపురం, హరిహర మహల్ దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ షెడ్యూలు దాఖలాస్తికి అనుభవదారుడు మరియు హక్కుదారుడు, ఈ మధ్య కాలములో షెడ్యూలు దాఖలాస్తిని కాజేయాలని ఉద్దేశ్యముతో నా క్లయింట్ యొక్క కుటుంబ సభ్యులు తప్పుడు ధృవపత్రాలను సృష్టించి వాటిని వేరొకరికి అమ్మేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలియవచ్చింది. ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎవరు ఎటువంటి క్రయవిక్రయాలు జరుపరాదు, అటువంటి క్రయవిక్రయాలు జరిపినట్లయితే నా క్లయింట్ తీసుకోబోయే క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు బాధ్యులు అవుతారు అని అందరిని హెచ్చరిస్తున్నాను.

యీ షెడ్యూలు ఆస్తి వివరములు : గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా పరిధిలోని లక్ష్మీపురం లొకాలిటీకి చెందిన గుంటూరు తాలూకు సర్వే నెం. 77, 78, 79 నందు చ।।గ।। 215.30 లు స్థలము అందలి డోర్ నెం. 5-87-132/2 గల ఆర్.సి.సి. స్లాబు ఇల్లు. **సరిహద్దులు: తూర్పు :** అ. 5 లు వెడల్పు మార్గము ఇతరులకు చెందును. **దక్షిణం :** యెనిమిరెడ్డి వెంకాయమ్మ గారి సరిహద్దు, **పడమర :** పారెళ్ళ ఉమామహేశ్వరి, మన్నెపల్లి ఉషారాణి సరిహద్దు, **ఉత్తరం :** అ. 30 లు వెడల్పు గల మున్సిపల్ రోడ్డు సరిహద్దు.

శివప్రసాద్‌బాబు గోపిదేశి, అడ్వకేటు
అశోక్‌నగర్, గుంటూరు.
ఫోన్ : 9542999909

గుంటూరు
తేది : 25-05-2024

తొలిసారిగా వీఏ ఎక్మో చికిత్స

యువకుడి ప్రాణాలు కాపాడిన రమేష్ హాస్పిటల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: ఏపీలో మొట్టమొదటిసారిగా వీఏ ఎక్మో చికిత్స ద్వారా హార్ట్ ఎటాక్‌కు గురైన యువ ఇంజినీర్‌ను కాపాడినట్లు గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్య బృందం వెల్లడించింది. శనివారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామారావు వివరాలు వెల్లడించారు. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న 35 సంవత్సరాల యువకుడికి రెండు వారాల కిందట మంగళగిరిలోని గుడికి వెళ్లినప్పుడు ఛాతిలో నొప్పి వచ్చిందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ దగ్గరికి వెళ్లగా ఆయన కొన్ని పరీక్షలు చేసి తీవ్రమైన గుండెపోటుగా నిర్ధారించి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కు రిఫర్ చేసినట్లు వెల్లడించారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసి గుండె పంపింగ్ తగ్గిపోవడం, కార్డియోజెనిక్ షాక్, పల్మనరి ఎడిమా వంటి క్లిష్టమైన పరిస్థితులు ఉన్నట్లు నిర్ధారించామని తెలిపారు. రోగికి వెంటనే వెంటిలేటర్ అమర్చి క్యాథ్ ల్యాబ్‌కు తరలించి యాంజియోగ్రాం పరీక్ష చేయగా గుండెకు రక్తాన్ని అందించే ప్రధాన రక్తనాళం నూరు శాతం రక్తపు గడ్డలతో పూడిపోయి ఉండటాన్ని గమనించామని చెప్పారు. వెంటనే ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ చికిత్స ద్వారా రక్తపు గడ్డలను తొలగించామని వివరించారు. గుండె అతివేగంగా కొట్టుకోవడం, రక్తపోటు తగ్గిపోవడం, మూత్రం కొద్దిగా మాత్రమే రావడం, వెంటిలేటర్ మీద కూడా ఆక్సిజన్ లెవెల్స్ సరిపడా లేకపోవడం, గుండె పనితీరు చాలా బలహీనంగా ఉండటం వంటి లక్షణాలు యువకుడిలో కనిపించాయన్నారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ లోనికి వెళ్లడంతో రోగి సహాయకులకు పరిస్థితి వివరించి, ఆఖరి ప్రయత్నంగా 'ఎక్మో' అనే లైఫ్ సేవింగ్ మెషీన్ ద్వారా చికిత్స అందించామన్నారు. ఎక్మో మెషీన్ సహాయంతో రోగిని ప్రాణహాని నుంచి కాపాడగలిగామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి వైద్య చికిత్స మొదటిసారిగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో నిర్వహించామని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్. రామారావు తెలిపారు. సడెన్ హార్ట్ ఎటాక్ వల్ల సంభవించే దుష్ఫలితాల్ని అధిగమించడానికి ఎక్మో తరహా వైద్య విధానం ఎంతో మేలు చేస్తుందని డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత వెల్లడించారు. యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు అభినందించారు. సమావేశంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, బిజినెస్ డెవలప్‌మెంటు హెడ్ డాక్టర్ కార్తిక్ చౌదరి పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన జానపాటి రమేష్ కుమారుడు అరుణ్ (16) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని బాలుడ్ని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



సీఐ నరేష్ కుమార్

గుంటూరు రూరల్: పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై అనునిత్యం నిఘా ఉంటుందని చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం అడవి తక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల రోజు జూన్ 4వ తేదీతో పాటు ఆ తరువాత రోజుల్లో ఎవరైనా రౌడీషీటర్‌లు ప్రజాశాంతికి భంగం కలిగించే కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాలతో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడితే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు రౌడీషీటర్‌ల కదలికలపై నిఘా ఎప్పటికప్పుడు ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వారి ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రశాంత వాతావరణం ఉండాలని ఎవరైనా దాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ ముందు రోజు కాని కౌంటింగ్ పూర్తయిన తరువాత రోజు కాని ఎక్కడైనా రౌడీషీటర్‌ల కదలికలు కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు.